# మృత్యుంజయుడు

"మృత్యుంజయరావ్ మహా అదృష్టవంతుడోయ్..."

"అదేంటి అట్లా అంటున్నావ్?...."

"అవును మరి. చావుని తప్పించుకొన్న ఘనుడు! నీకు తెలీదా?..

"ఏక్సిడెంటా ఎస్కేపా?..."

కాదన్నట్టు తల అడ్డంగా ఆడించాడు అహోబలరావు.

"మరి... నాకు అంతుబట్టి చావడంలేదు.. విషయమేంటో నువ్వే చెప్పు.." నిలదీసాడు దామోదరం.

"ఆయుర్దాయం మూడి యమధర్మరాజు వచ్చి ఎదురుగా నిలబడినా... లెక్క చేయకుండా అతగాడితో... ఎవరితో?...ఆ యముడితో వాదించి గెల్చి గట్టెక్కాడు! మొత్తానికి పేరుకు తగ్గవాడు..."

అదెట్లా?..."

వివరాల్లో కెడితే.... ముగ్గురూ ఫ్రెండ్స్! పక్క పక్క ఇళ్ళవాళ్లు!

మృత్యుంజయరావు గురించి చెప్పాలీ అంటే అతగాడి పుట్టు పూర్వోత్తరాల గురించి ముచ్చటించుకోవాలి..."!

పుణ్య దంపతులకు లేక లేక కలిగిన ఏకైక నలుసు!

పుట్టిన బిడ్డ 'కేవ్' మని ఏడుస్తాడు ఈ ప్రపంచంలో పడగానే. అందుకు భిన్నంగా ఇతగాడేమో 'కథ...కథ' అంటూ ఏడ్చాట్ట!

ఆ విషయం ఆ పురుడు పోసిన మంత్రసాని చెప్పగా విన్న వారంతా ఇదెక్కడి చోద్యం అంటూ ముక్కున వేలేసుకున్నారు.

పుట్టినప్పటి నుండే విచిత్రాలు చేయటం మొదలు పెట్టిన మృత్యుంజయరావు ముక్కీ మూలిగి ఎలాగైతేనేం డిగ్రీ అంది పుచ్చుకునేసరికి తాతలు దిగొచ్చారు.

డిగ్రీ చదివే రోజులలో వరుసగా మూడేళ్లు కాలేజీ మేగజైన్లో కథలు వ్రాసాడు. అది చదివిన తెలుగు లెక్చరర్ పురుషోత్తమ్ మేష్టారు ముచ్చటపడి మృత్యుంజయుడ్ని దగ్గరకు పిల్చి కౌగలించుకొని ముద్దాడి వీపు చరిచి 'భేష్....' నీ కథలు శానా బోల్డు బావున్నాయ్. ఏనాటికైనా 'గురజాడ' అంతటి వాడివౌతావ్' అంటూ దీవించారు.

అదిగో... అక్కడ్నుంచి మొదలైంది మృత్యుంజయరావు సాహితీ ప్రస్థానం!

రవీంద్రనాథ్ ఠాగూర్ అంతటి గొప్ప రచయిత అయిపోవాలని కలలు కన్నాడు. ఎంతో శ్రమిస్తూ వచ్చాడు.

చెప్పులరిగేట్టు తిరగ్గా తిరగ్గా ఓ 'ఎల్జీసీ'ఉద్యోగం సంపాదించటం బ్రహ్మతరమైంది.

ఆముదంతాగిన వాడిలా మఖం పెట్టి 'నాకీ ఉద్యోగం నచ్చలేదు....'' అనేసి అలిగి బుంగమూతి పెట్టాడు.

"నచ్చటానికిదేమైనా ఆడపిల్లట్రావెధవా..." తండ్రి మాటల్లో రఫ్ ఆడించాడు.

నోరు మెదపక పోయాడు మృత్యుంజయరావు.

"నువ్వు సంపాదించి మమ్ముద్ధరించకర్లా... నీ పొట్ట అయినా పోసుకోవాలా! రేపు నీ పెళ్లానికి ఇంత పెట్టాల్నా ?" తల్లి సావిత్రమ్మ దీర్ఘాలుతీస్తూ సతాయించింది.

"అసలు నీ మనసులో ఏముందో అఘోరించి ఏడవ్వోయ్..." కామెడీ వాలకబోసి అడిగేడు తండ్రి.

చెప్పాలా వద్దని నీళ్లు నముల్తున్నాడు.

"ఉద్యోగం చేయకపోతే అడుక్కుతింటావట్రా? ఈ రోజుల్లో ముష్టి కూడా ఎవ్వరూ వేయటం లేదు..." తంఁడ్రి ముఖంలో చిరు కోపం తొంగి చూసింది.

"నాకేదైనా పత్రికాఫీసులో ఉద్యోగం చేయాలనుంది..." గొణిగాడు.

"ఎందుకుట" తండ్రి మాటల్లో వెటకారంగా ధ్వనించింది.

"నే కథలు రాస్తాను కదా! అందుకు!!.."

"ఛ, నోర్ముయ్... వెధవ కాన! కథలు...కాకర కాయలు నీకు తిండి పెట్టదు....గుమాస్తా ఉద్యోగమంటే మాటలు కాదు. దీన్ని చేస్తూ దాన్ని వుద్ధరించొచ్చు..."

తండ్రి చండశాసనుడు కావటం మూలాన నోరు మెదపలేక పోయిన మృత్యుంజయరావు ఎట్టకేలకు గుమాస్తా గిరి ఊబిలో ఇరుక్కోక తప్పలేదు.

వుద్యోగం చేస్తూ చేస్తూ... కథలు రాస్తూ...రాస్తూ.. కథల ఫ్యాక్టరీ స్థాపించి చివరికి రిటైరై... షష్టిపూర్తి కూడా చేసుకుని పదేళ్లు కావస్తోంది.

ఇన్నేళ్లుగా కథలు వ్రాస్తున్నా అతనికి తనివి తీరదు. సంవత్సర ఫలాల ప్రకారం రాజపూజితం 3 అవమానం 7. అంటే వ్రాసే పది కథల్లో మూడు అచ్చుకు నోచుకుంటాయ్. మిగతావి ఏ పత్రికకూ నచ్చక తిరిగి పుట్టిల్లు చేరుకుంటాయ్. అదన్న మాట సంగతి!!"

ఎన్ని కథలు తాను వ్రాసినవి పత్రికల్లో అచ్చు అయినావన్నవికాదు ప్రశ్న?... ఒక్కదానికైనా కథల పోటీలో ఏ నాడూ బహుమతి నోచుకోలేక పోయిందనేది అతగాడి దిగులు!

తన కళ్ల ముందు పుట్టి పెరిగిన కుర్రకుంకలెందరో ప్రైజులు కొట్టేస్తుండగా... తనకు అంతటి అదృష్టం పట్టకపోయేనని మృత్యుంజయరావు దిగులు!

కథకు ప్రైజ్ రాలేదు. తన కెవడూ సన్మానమూ చేయలేదు... ఓ బిరుదూ ప్రదానం చేయలేదు.

వయస్సు మీద పడుతోంది. రాయగల ఓపికా సన్నగిల్లుతోంది. ముసలమ్మకి దసరా పండుగన్నట్టు ఇక తనకు ప్రైజొచ్చి ఏం లాభం?

బెడ్‌మీద పడుకుని కాలుమీద కాలేసుకుని వారపత్రిక తిరగేస్తున్న మృత్యుంజయరావుకి మూడవ పేజీలోనే కథల పోటీ తాలూకు ప్రకటన కళ్లబడ్డది.

దాన్ని చూడగానే వేయి ఏనుగుల బలం వచ్చిన వాడికి మల్లె గభాలున లేచి కూర్చున్నాడు.

మొదటి బహుమతి లక్షరూపాయలు... రెండవ బహుమతి యాభైవేలు... మూడో బహుమతి పాతిక వేలని చూడగానే కొండంత బలంతో పోటీకి ఓ కొత్త కథ వ్రాయాలన్పించింది.

శ్రీమతి గ్లాసుతో పళ్ల రసం తెచ్చి అందించింది. రెండు గుక్కల్లో పళ్లరసాన్ని లాగించిన భర్త వుత్సాహాన్ని చూసి అర్ధాంగి బిత్తర పోయింది.

"నీరసంగా వుంటిరి..." అలా గంతులేయకండీ..."

"నువ్విచ్చిన...నేను తాగిన పళ్లరసం మహాత్యమే! కొత్త కథకి ప్లాట్ ఆలోచిస్తున్నా! ఫస్ట్ ప్రైజ్ లక్షే! - లక్ష!! ..లక్షంటే ఎంతో నీకు తెల్సుగా... దాన్ని నేను స్వంతం చేసుకోవలసిన తరుణం ఆసన్నమైంది....' భార్య భుజాలు పట్టుకుని కుదిపేడు.

"వెర్రి కుదిరింది తలకి రోకలి చుట్ట మన్నాడట... వెనకటికి మీ లాంటి వాడు! - ఒక పక్క రెండు రోజులుగా లంఖణాలతో మంచానికి అతుక్కుపోయిన మీరు... ఇప్పుడు కథ వ్రాస్తారా? చోద్యం కాకపోతే..."

"నువ్ నోర్మూయ్" నా రైటింగ్ ప్యాడ్... బాల్ పెన్నూ పట్రా...! పోటీకి కథ వ్రాసి-పంపి తీరాలి!. ఫస్ట్‌ప్రైజ్ కొట్టితీరాలి.

"మీ ఉత్తర ప్రగల్భాలకేమొచ్చెలెండి. నలభై యేళ్ల సంసారంలో... మీరు బహుమతి కొట్టింది లేదు. నాకళ్లతో చూసిందీ లేదు. మన మొహాలకి అంత అదృష్టం కూడానా..." శాపనార్థాలు పెడుతూ రైటింగ్ పాడ్ బాల్‌పెన్నూ తెచ్చి ఇచ్చింది.

వాటిని అందుకుని "అవును.. ఈ రోజు తిథి ఏమిటి?..."

"నా శ్రాద్ధం! ఇందుక్కూడా తిథి వార నక్షత్రాలు చూడాలా ఏమిటీ... అంటూ చెల్ల పిల్ల వారి పంచాంగం తెచ్చి భర్తకిచ్చింది.

"లక్షలు దక్కాలంటే ఇటువంటివి తప్పవు" అనేసి పంచాంగం తిరగేసి.. నిన్న పౌర్ణమి వెళ్లగా పాడ్యమి... అంటే ఈ రోజు విదియ..! వర్జ్యం కూడా లేదు. అంతా భేషుగ్గా వుంది! కొత్త కథకి శ్రీకారం చుట్టాడు... తన్లో తాను సంబరపడి పోతూ చంకలు గుద్దుకున్నాడు మృత్యుంజయరావు.

కథ అరుపేజీలు వ్రాసే సరికి వెన్ను నొప్పెట్టింది. వీపు పీకింది. ఇక చాల్లే అనుకుని పక్కమీద వాలిపోయి రెండు కళ్లూ మూసుకున్నాడు.

'అలికిడి అయినట్టన్పించి కళ్లు తెరిచి చూసాడు. ఎదురుగా గుమ్మం దగ్గర... లావుపాటి నల్లని ఆకారం. వంటిమీద బంగారు నగలున్నయ్. నెత్తిమీద కిరీటం.. భుజాన గదలాంటిది వుండటం చూసి నిర్ఘాంతపోయాడు.

ఇది కలా... నిజామా... అనుకుని చేతిని గిల్లు కున్నాడు. నిజమే అన్పించింది.

క్రమంగా ఆ ఆకారం పడుకున్న మంచానికి దగ్గరైంది.

కెవ్‌న కేకేయ బోయిన వాడల్లా ఆగి? ఎవరు నువ్వు విస్మయంతో అడిగాడు.

"నువ్వు కాదు... మీరు! మీరు అనాలి!... మర్యాద...మర్యాద..."

"తమరెవరండీ...?" స్వరం వణికింది

"ఆ! అట్లారా దారికి! నేను నీ పాలిట యముడ్ని: నీ ప్రాణాలు కొనిపోవుట కొచ్చిన యమధర్మరాజుని..."

నిలువుగుడ్లు పడి ప్రాణం పోయినంతపనైంది.

ధైర్యాన్ని కూడదీసుకుని 'గాడిద గుడ్డేం కాదూ... అబద్ధం చెప్పినా అతికేట్టుండాలి...' నేన్నమ్మను..." కీచు గొంతుతో మాట్లాడాడు.

"నమ్మి తీరాలి."!

"యముడివైతే నడిచొచ్చావేం... నీ దున్నపోతు అదే.. నీ వాహనం మహిషమేదీ?..."

"దాన్ని ఇంట్లోకి తేలేను కదా!?.. వీధిలో బాదం చెట్టుక్కట్టి నేను లోపకికొచ్చా! నేటితో నీకు ఆయుర్దాయం తీరింది..."

కుడితిలో పడ్డ ఎలకలా తయారైంది మృత్యుంజయరావు స్థితి.

ఒక వేపు కథ పూర్తి చేసి రేపు కొరియర్లో పంపాలి! మరోవేపు ఆయుర్దాయం మూడిందంటూ

యముని గర్జింపు!.. ఇప్పుడెట్లా?.. ఏం చేయటం...?

"వ్యవధి లేదు. ఊ! నడు..."

"హు! బెదిరించకు యమధర్మరాజా! - నాపేరు మృత్యుంజయుడు. చావుకి వెరవను. చూడు మగడా.. నాక్కొంచం వ్యవధి కావాలి..!

"ఎందుకట?.."

" పోటీకి నేనొక కథ వ్రాస్తున్నాను. బహుమతి విలువ ఎంతో తెలుసా? లక్ష రూపాయలు! కథ పూర్తి కాలేదు. దాన్ని పూర్తి చేసి బహుమతిని దక్కించుకోవాలి!... నేను రచయితనయ్యా బాబూ...!" నా మాట నమ్ము! ప్రథమ బహుమతిని కళ్లారా చూడాలి!. ఆనందంతో నా తనువు మనసు పులకించాలి! నా ప్రతిభకి ప్రజలు పట్టం కట్టాలి?...నాకు సన్మానం చెయ్యాలి!.. ఇంకా.. ఇంకా.."

"అఘోరించావ్! ఇన్నేళ్లుగా లేనిది ఇప్పుడింకేం పీకుతావ్‌లే.. వచ్చేయ్... నావెంట వచ్చేయ్..."

ఇక లాభం లేదనుకుని వినియంగా మంచం దిగాడు. యముడి కాళ్లు చుట్టేసుకున్నాడు.

"చూడు మహానుభావా... నేను వయోవృద్ధుడనే కాను... సీనియర్ సిటిజన్‌ను కూడా! నేను ఒంటరివాడిననుకుంటివేమో కాదు... నా వెంట క్యూలో వందలాది రచయితలున్నారు. నన్ను బలవంతాన తీసుకెడితే..వారు నిన్ను బ్రతుకనీయరు. నీ అంతు చూస్తారు..." ఆవేశంతో వూగిపోతూ నోటికొచ్చినట్టల్లా వాగేడు మృత్యుంజయరావు.

"ఇవ్వను గాక ఇవ్వను. నీకు పర్మిషన్ ఇచ్చుట నా పరిధిలో లేదు రైటరూ! నన్ను విసిగించకుము..."

"అట్లాగేం!?-నొవ్వొక అబద్ధాల పుట్టువు. నీ మాట నేను నమ్మను..."

"ఎందుకని?.." స్వరం రెట్టించాడు యముడు.

"అలనాడు సతీసావిత్రి భర్త ప్రాణములు ఆమెకి తిరిగి ఈయలేదా? అది మరచి నన్ను బెదిరించుట న్యాయసమ్మతము గా లేదు..."

"అది వేరు.. ఇది వేరు..."

"వేరు లేదు కొమ్మలేదు. అపునీ బూటకపు మాటలు! ఆ విషయం విడిచిపెట్టు! మార్కండేయుని ప్రాణములు కొనిపోలేక ఎందుకు విడిచిపెట్టావ్? అతనికి శివుని రికమెండేషన్ ఉందనా? వారెవా!? ఏమి మీ బుద్ధి కుశలత?-నాకెవ్వరూ దిక్కులేరనే కదా బెదిరించుచున్నావు. అంతే కాదు.. గజేంద్రుని మొసలి ప్రాణాలు తీస్తున్న సమయాన సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే ఏనుగును రక్షింపలేదా? నాకు పురాణ గాథలన్నియూ తెలుసు! మన మధ్య వాదోపవాదములు అనవసరము. నేను నీ వెంట రాను గాక రాను. నీవు మరలిపొమ్ము

యమ ధర్మరాజా.." సామ దాన బేధ దండోపాయములు ప్రయోగించి తనను తాను కాపాడు కోవాలని ట్రై చేస్తున్నాడు మృత్యుంజయరావు.

"మానవా! "నన్నే ఎదురించుచుంటివా?... నా బలహీనత గమనించి నా ఫ్లాష్ బ్యాక్ గుర్తుచేసి నన్ను వట్టి చేతులతో వెళ్లమనుట పాడిగాదు! - నిన్ను విడిచి వెళ్లుట నా వల్ల కాదు మానవా - వల్లకాదు..."

మృత్యుంజయరావుకి వళ్లు మండిపోయింది. తోకతొక్కిన తాచులా బుసకొట్టాడు.

"ఓహో! అట్లాగేం? అయితే సరే. మానవుల తడాకా ఏమిటో చూపిస్తాను. నీవు మంచి మాటలు చెప్తుంటే వినుటలేదు. అందుకే నీ మీద హైకోర్టులో బలవంతాన నన్ను లాక్కెళ్లాలను కుంటున్న నీపై దావా వేస్తాను. స్టే తెచ్చుకుంటాను. అప్పుడు నీవు నన్ను కనీసం తాకనైనా తాకలేవు. వట్టి చేతులతో వెనుదిరుగక తప్పదు! మా దేశంలో సివిల్ కేసు పరిష్కారం కావాలంటే ఎట్లా లేదన్నా పుష్కరకాలం పడుతుంది. అంతవరకు నువ్వు యమలోకంలో!... నేను భూలోకంలో..! అంటే నా ఆయుష్షు పెరిగినట్టేగా?! నువ్వు ఓడినట్టేగా?! కేసు డిసైడ్ అయ్యే లోపు నాకు ఎన్నో కథలు వ్రాయగల అవకాశముంటుంది. సుడి తిరిగితే బహుమతి కూడా కొట్టొచ్చు. నాకు సన్మానాలు జరుగవచ్చు!!! ఏమనెదవు యమధర్మరాజా..."

చేతులతో నుదిటిపై బాదుకుని "మీ మానవులతో వచ్చిన చిక్కేయిది! తెలివిలో మమ్మే మించిపోయి నారు. ఏం చేస్తాం. వెళ్లి వచ్చెదను మానవా... కోర్టులో కేసు తేలునంతవరకూ నీ జోలికిరాను... సరేనా..!! "వచ్చిన దారినే మరలిపోయాడు యమధర్మరాజు"

తన పాచిక పారి యముడు తోకముడిచి వెళ్లి పోయిన వుత్సాహంలో.. సంతోషములో... మిగతా పేజీల కథ వ్రాయటం పూర్తి చేసి కొరియర్లో పంపించి... పత్రికాఫీసు నుండి బహుమతి శుభవార్తకై మృత్యుంజయరావు నిరీక్షిస్తూండిపయాడు.

ఫస్ట్ప్రైజ్ అతనికథకే వచ్చింది

మృత్యుంజయరావు నిజంగా సార్థక నామధేయుడే!!

-:: సమాప్తం::-